పల్లెకు అందని వైద్యం

- సమ్మెబాట పట్టిన పీహెచ్‌సీ వైద్యులు
- వారం రోజులుగా నిలిచిన వైద్యసేవలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న పల్లె జనం

పూసపాటిరేగ: పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) వైద్యుల సమ్మెబాట పట్టడంతో నియోజకవర్గ వ్యాప్తంగా పల్లె వైద్యం పడకేసింది. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ వైద్యులు సమ్మెకు దిగి విధులకు హాజరు కావడం లేదు. దీంతో వైద్యసేవల నిమిత్తం ఆస్పత్రులకు వచ్చే గ్రామీణులంతా నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఓపీ, అత్యవసర సేవలు కూడా లేకపోవడంతో చాలామంది నిరుపేదలు ప్రభుత్వం వైద్యం అందక అవస్థలు పడుతున్నారు. అప్పులు చేసి మరీ ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నా..అవి క్షేత్ర స్థాయిలో అంతగా లేవన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.



పూసపాటిరేగ పీహెచ్‌సీ

అక్టోబరు 1 నుంచి దూరం..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులు అక్టోబరు 1వ తేదీ నుంచి విధులకు దూరమయ్యారు. అయితే విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి జాతర మహోత్సవాలు దృష్ట్యా ఈ నెల 7వ తేదీ వరకు ఉన్నతాధికారుల విజ్ఞప్తుల మేరకు పీహెచ్‌సీ వైద్యులు జిల్లాలో అందుబాటులో ఉన్నట్లు భోగట్టా. ప్రస్తుతం ఈ నెల 8వ తేదీ నుంచి ఏ పీహెచ్‌సీలోనూ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో వైద్యం కోసం ఆస్పత్రులను ఆశ్రయించే వారు వెనక్కి వెళ్లిపోతున్నారు. రెగ్యులర్ వైద్యుల స్థానంలో డిప్యుటేషన్‌పై మరో ఆస్పత్రి నుంచి వైద్యులను అందుబాటులోకి తీసుకువస్తున్నా సక్రమంగా సేవలందడం లేదన్న వాదనలు రోగుల నుంచి వినిపిస్తున్నాయి.

ఇవీ వారి డిమాండ్లు..

వైద్యుల డిమాండ్లలో ప్రధానంగా జీవో నంబరు 85, ఇన్ సర్వీస్ కోటా పునరుద్ధరణ, టైమ్ బాండ్ పదోన్నతులు అమలు, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి బేసిక్ పే 50 శాతం, ట్రైబల్ అలవెన్సులు, నోషనల్ ఇంక్రిమెంట్లు అమలు వంటివి ఉన్నాయి. అలాగే చంద్రన్న సంచార వాహన చికిత్స సంబంధించి రూ.5 వేల అలవెన్స్‌తో పాటు నేటివిటీ, అర్బన్ ఎలిజిబిలిటీ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు. వీటితో పాటు కచ్చితమైన పని గంటలు, వారాంతపు సెలవులు, జాబ్‌చార్ట్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని అడుగుతున్నారు.

తక్షణమే వైద్యం అందేలా చూడాలి..

తక్షణమే వైద్యుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి, వారిని విధుల్లోకి తేవాలి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు పీహెచ్‌సీల్లో వైద్యసేవలు అందేలా చూడాలి. చలో అమరావతి కార్యక్రమం పేరిట వైద్యులు సమ్మెలో పాల్గొనడంతో సక్రమంగా వైద్యం అందే పరిస్థితి లేదు. ప్రభుత్వం స్పందించి, వైద్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

–బి.సూర్యనారాయణ, సామాజిక కార్యకర్త, పూసపాటిరేగ

ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు..

పీహెచ్‌సీ వైద్యుల సమ్మెతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలు బంద్ అయ్యాయి. దీంతో రోగులు అప్పులు చేసి మరీ ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ఇంకా ఎన్నాళ్లిలా పరిగెత్తాలని జనం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. తక్షణమే వైద్యులు అందుబాటులోకి వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

150 నుంచి 200 ఓపీలు..

పూసపాటిరేగ పీహెచ్‌సీలో సాధారణ రోజుల్లోనూ రోజుకు 150 నుంచి 200 వరకు ఓపీ వస్తుంటుంది. రెల్లివలస, గోవిందపురం పీహెచ్‌సీల్లో అయితే రోజుకు 100 నుంచి 120 వరకు..డెంకాడ, మోపాడ, పోలిపల్లి, సతివాడ, కొండవెలగాడ పీహెచ్‌సీల్లో 100 వరకు ఓపీ ఉంటుందని, ఈ నేపథ్యంలో వైద్యులు లేకుంటే ఎలా అని గ్రామీణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పీహెచ్‌సీ పరిధిలోని 104 వాహనాల సేవలు కూడా గ్రామాల్లో కానరాకపోవడంతో వృద్ధులు, గర్భిణులు, బాలింతలకు అంతగా సేవలందడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందక ఎంతోమంది పేదలు ఇక్కట్లు పాలవుతున్నారు.

క్లుప్తంగా

పంటకోత ప్రయోగంపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న మండల వ్యవసాయాధికారి నీలిమ

పూసపాటిరేగ: స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లకు వరి పంటకోత ప్రయోగంపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ప్రయోగం ఏ విధంగా చేయాలి..పంట దిగుబడిని ఎలా నిర్ధారించాలన్న విషయాలను మండల వ్యవసాయాధికారి కె.నీలిమ వివరించారు. వరి సాగు చేస్తున్న రైతులకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద బీమా వర్తిస్తున్నందున తప్పనిసరిగా పంటకోత ప్రయోగం చేయించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో మణీంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పూసపాటిరేగ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీఎస్టీ అధికారి కె.సత్యనారాయణ..కేంద్రం జీఎస్టీ శ్లాబ్‌లలో చేసిన సవరణలు తెలిపి, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. 28 శాతం జీఎస్టీని 18 శాతానికి, 18 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించడం జరిగిందని, దీంతో ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ పరికరాలు, గృహోపకరణాలు, నిత్యావసర సరుకులపై కొంతవరకు పన్ను భారం తగ్గిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జీఎస్టీ అధికారి వంశీకృష్ణ, ఎంపీడీవో వై.ఎస్.ఆర్ నాయుడు, ఈవోపీఆర్‌డీ జ్ఞానేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోవా గవర్నర్‌ను కలిసిన ఎస్పీ



గవర్నర్‌ను కలిసిన ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైమ్: గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజును ఎస్పీ దామోదర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీపైడితల్లి పండగ సందర్భంగా ఈ నెల 2వ తేదీన జిల్లాకు విచ్చేసిన ఆయనను ఎస్పీ కలిసి ఉత్సవాల విజయవంతం, ఏర్పాట్లపై చర్చించారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారని గవర్నర్ ఎస్పీని అభినందించారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

జామి: గత విద్యా సంవత్సరంలో అలమండ బాలురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు పద్మావతి ప్రేరణ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో పాఠశాల పూర్వపు విద్యార్థి సామంతపూడి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో హెచ్‌ఎం రామారావు శుక్రవారం నగదు ప్రోత్సాహకాలు అందించారు. పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన బోని మనోహర్‌కు రూ.25వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన గాజుల యశ్వంత్‌కు రూ.15వేలు అందజేశారు. తొమ్మిదో తరగతిలో ప్రతిభ చూపిన వి.ఇషాక్‌కు రూ.20వేలు, బి.రోహిత్‌కు రూ.15వేలు అందజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వస్తు ప్రదర్శన

జామి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై విజయనగరం జిల్లా జీఎస్టీ తూర్పు విభాగం అధికారి రెడ్డి శ్రీను ఆధ్వర్యంలో శుక్రవారం ఎలక్ట్రానిక్ వస్తు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎంపీడీవో నరసింహులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిందన్నారు. వాటి ఫలాలు ప్రతి వినియోగదారుడికి అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ట్యాక్స్ కన్సల్టెంట్ శ్రీనివాసరావు, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన విద్యార్థుల అక్షరాకృతి

చీపురుపల్లి: మండలంలోని కర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మెంటల్ హెల్త్ ఆకారంలో సిద్ధం చేసి అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ సకుమల్ల శివాజీ మాట్లాడుతూ విద్యార్థి దశలో ఎదురయ్యే మానసిక సమస్యలను పరిష్కరించుకోవడంపై అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరూ ఒత్తిడి సమయంలో సైతం సానుకూల నిర్ణయాలు తీసుకోవాలన్నారు.

ప్రశాంత వాతావరణంలో జాతర మహోత్సవాలు



ఎస్పీ దామోదర్‌కు అభినందనలు తెలియజేస్తున్న ఐక్యవేదిక సభ్యులు

విజయనగరం టౌన్: ప్రశాంత వాతావరణంలో విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి జాతర మహోత్సవాలు నిర్వహించడంలో జిల్లా పోలీస్ శాఖ చేసిన కృషి ఎనలేనిదని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కులాల ఐక్యవేదిక నాయకులు చోడి ఆదినారాయణ, ఇప్పిలి రామారావు, గంట్రేటి శ్రీను, కరీంలు ప్రశంసించారు. ఇదే విషయమై జిల్లా కేంద్రంలో ఎస్పీ దామోదర్‌ను శుక్రవారం కలిసి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉత్సవాల్లో ఐక్యవేదిక తరఫున భక్తుల దాహార్తి తీర్చేందుకు చేపట్టిన తాగునీటి పంపిణీ, ఆకలి తీర్చేందుకు చేసిన పులిహోర సరఫరా వంటివి ఆనందాన్నిచ్చాయన్నారు. పటిష్టమైన భద్రత నడుమ ఉత్సవాలు నిర్వహించడం సంతోషంగా ఉందని, గంజాయి, జూదం, మత్తు పదార్థాల రవాణాను నిషేధించి యువతను కాపాడారన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక ప్రతినిధులు ఎస్.ఆదిలక్ష్మి, లక్ష్మణరావు, బంగారురాజు, శ్రీను, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సవరణకు వచ్చిన దరఖాస్తులను పరిష్కరించండి



సమావేశంలో పాల్గొన్న డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, తదితరులు

విజయనగరం అర్బన్: జిల్లాలో ఓటర్ల జాబితా సవరణకు వచ్చిన దరఖాస్తులను వారం రోజుల్లోగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని తన చాంబర్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో క్లెయిమ్స్, అబ్జక్షన్లపై సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ అందిన క్లెయిమ్స్‌పై అదేరోజు చర్యలు తీసుకోవాలని..ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు క్రమం తప్పకుండా సమన్వయం చేసుకోవాలన్నారు. ఏ రోజు దరఖాస్తులు ఆరోజు పరిష్కరిస్తే పెండింగ్‌లు ఉండవన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 7 రోజులు దాటిన 28 క్లెయిమ్స్ ఉన్నాయని, వీటిలో ఫారం–6లు 17, ఫారం–7లు నాలుగు, ఫారం–8లు 7 ఉన్నాయన్నారు. రాజాం, బొబ్బిలి, చీపురుపల్లి నియోజకవర్గాల్లో ఎటువంటి పెండింగ్‌లు లేవన్నారు. ఏడు రోజులు దాటిన దరఖాస్తులను ప్రాసెస్ చేయకపోతే సంబంధిత ఈఆర్‌వోల నుంచి వివరణ కోరాలని ఎన్నికల కమిషన్ అదేశించిందన్నారు. వివరణలను ప్రతినెలా 5వ తేదీకి ముందుగా కలెక్టర్‌కు పంపాల్సి ఉంటుందని, ఎన్నికలకు సంబంధించిన పనులపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్లు నూకరాజు, ప్రమీలా గాంధీ, కళావతి, ఆశయ్య, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

విజయనగరం ఫోర్ట్: స్థానిక దాసన్నపేట విద్యుత్ భవన్‌లో విద్యుత్ శాఖ ఎస్ఈ మువ్వల లక్ష్మణరావును శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అత్యుత్తమ సేవలందించినందుకు గాను ఆయనకు ప్రభుత్వం నుంచి స్వచ్ఛాంధ్ర అవార్డు రాగా ఈ మేరకు ఆయనను అభినందించి సత్కరించినట్లు ఈఈ సురేష్‌బాబు తెలిపారు.

డీపీఓలో పోలీస్ వెల్ఫేర్ డే

- సమస్యలు ఏకరువు పెట్టిన సిబ్బంది



తన చాబర్‌లో సిబ్బంది సమస్యలను వింటున్న ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైమ్ : జిల్లా ఎస్పీగా ఎ.ఆర్.దామోదర్ బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా తన చాంబర్‌లో శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం పది మంది సిబ్బంది తాము అనుభవిస్తున్న, చెప్పుకోలేని, వృత్తి పరంగా, శాఖా పరంగా పడుతున్న బాధలను, సమస్యలను ఫిర్యాదుల రూపంలో వ్యక్త పరిచారు. జిల్లా పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ విజ్ఞాపనలు స్వీకరించి, పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, శాఖ సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు.

ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్ కమ్ సేల్ ప్రారంభం



విజయనగరం జిల్లా కేంద్రంలో ప్రభుత్వం సంగీత, నృత్య కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్ కమ్ సేల్‌ను కలెక్టరు రామ్‌సుందర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా తగ్గిన జీఎస్టీపై అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

సీజేఐపై దాడి అమానుషం



లక్కవరపుకోట: గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

గజపతినగరం: సుప్రీం కోర్టు సాక్షిగా సీజేఐ గవాయ్‌పై బూటుతో దాడి చేయడం అమానుషమని, ఇది దేశ చరిత్రలో మాయని మచ్చ అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు వి.లక్ష్మి మండిపడ్డారు. మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ దాడికి పాల్పడిన న్యాయవాది కిశోర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజలంతా గవాయ్‌పై జరిగిన దాడిని ప్రజాస్వామ్యంపై, భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా చూడాలన్నారు. ప్రజలంతా తీవ్రంగా ఖండించాలన్నారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఇటువంటి దాడులు పెచ్చుమీరుతున్నాయని అన్నారు. దేశంలో న్యాయమూర్తులకే రక్షణ ఇవ్వలేని ప్రభుత్వాలు సాధారణ ప్రజలకు ఏమి రక్షణ కల్పిస్తాయని ప్రశ్నించారు.

న్యాయమూర్తిపై దాడి అమానుషం

లక్కవరపుకోట: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై కొద్ది రోజుల క్రితం న్యాయవాది దాడికి యత్నంచడం అమానుషమని సీపీఎం నాయుకులు అన్నారు. ఈ దాడిని ఖండిస్తూ సీపీఎం నాయకులు గాడి అప్పారావు, తరిణి వెంకటరమణల ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. నిందితుడుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వంలో ప్రజాస్వామ్యంపై దాడులు పేట్రేగుపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం హైస్కూల్ వద్ద ఉన్న గాంధీజీ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. కార్యక్రమంలో పలువురు సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి కుట్రలను అడ్డుకోవాలి

- వైద్య విద్యను వ్యాపారంగా మారిస్తే సహించేది లేదు
- ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



కోటి సంతకాల ప్రజాఉద్యమం వాల్‌పోస్టరు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ తదితరులు

నెల్లిమర్ల రూరల్: రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య విద్యను వ్యాపారంగా మార్చే కూటమి ప్రభుత్వ కుట్రలను అడ్డుకోవాలని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, వైఎస్సార్ సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడ్డుకొండ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మండలంలోని రామతీర్థం గ్రామంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల ప్రజా ఉద్యమం కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. తొలుత రచ్చబండ నిర్వహించి, ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి జగనన్న హయాంలో నిర్మించిన వైద్య కళాశాలల ఆవశ్యకతను వివరిస్తూ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేద విద్యార్థి వైద్యవిద్యను అభ్యసించాలనే సదుద్దేశంతో నాడు జగనన్న ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, నేడు వాటిని ఈ కూటమి ప్రభుత్వం ప్రైవేటుకు అప్పగించాలనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు నేడు కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని, 15 మాసాల్లో ప్రశ్నిస్తున్న వారిపై తప్పుడు కేసులు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ప్రజలకు మంచి జరిగితే చంద్రబాబు ఓర్వలేరని, అందుకే ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే కుట్రకు తెరతీశారని దుయ్యబట్టారు. సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు ఉపయోగపడే ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయకుండా మనమంతా ఐక్యంగా ఉద్యమించాలన్నారు. నర్సీపట్నంలో అసలు మెడికల్ కళాశాలలే లేవని స్పీకరు అయ్యన్నపాత్రుడు అబద్ధాలు మాట్లాడితే సాక్షాత్తు వాటి నిర్మాణానికి శ్రీకారం చుట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ఆ ప్రాంతంలో పర్యటించి ప్రజలకు వాస్తవాన్ని తెలియజేశారన్నారు. జగనన్న పర్యటనకు అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని, పోలీసులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఎదురుతిరిగి మరీ జగనన్న వెంట నడిచారన్నారు.



రామతీర్థంలో ఇంటింటికీ వెళ్లి సంతకాలు సేకరిస్తున్న ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే, నాయకులు

నవంబరు 22 వరకు సంతకాలు..

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నవంబర్ 22వ తేదీ వరకు నియోజకవర్గ వ్యాప్తంగా రచ్చబండ, సంతకాల సేకరణ ఉద్యమం కొనసాగుతుందని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు స్పష్టం చేశారు. ఈ నెల 28న నియోజకవర్గ కేంద్రమైన నెల్లిమర్లలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీ ఉంటుందన్నారు. నవంబర్ 12న జిల్లా కేంద్రంలో ర్యాలీ ఉంటుందని, నవంబర్ 23న నియోజకవర్గంలో సేకరించిన సంతకాల పత్రాలను జిల్లా పార్టీకు అప్పగిస్తామన్నారు. నవంబర్ 24న జిల్లా కేంద్రం నుంచి పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపిస్తామని, అనంతరం కోటి సంతకాల పత్రాలను గవర్నర్‌కు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పతివాడ సత్యనారాయణ, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు, నగర పంచాయతీ కౌన్సిల్ వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, సీనియర్ నాయకుడు దంతులూరి గిరిబాబు, యువజన విభాగం నాయకుడు బడ్డుకొండ ప్రదీప్‌నాయుడు, సర్పంచ్‌లు సూర్యకళ, కిరణ్, రామచిరంజీవి, శ్రీను, రామారావు, పరిశినాయుడు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో పైడితల్లి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి జాతర మహోత్సవానికి రాష్ట్ర నలుమూలల నుంచి జిల్లాకు విచ్చేసిన భక్తులంతా వారి స్వస్థలాలకు వెళ్తూ వెళ్తూ శుక్రవారం అమ్మవారి ఆలయానికి చేరుకుని దర్శించుకున్నారు. అందరం బాగుండేలా దీవించాలని అమ్మవారిని వేడుకున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

బాల్యవివాహాలతో అనర్థాలు..



బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ తలచుట్ల హరిబాబు

మెరకముడిదాం: బాల్యవివాహాల వల్ల చాలా అనర్థాలు ఎదుర్కోనాల్సి ఉంటుందని వైస్ ఎంపీపీ తలచుట్ల హరిబాబు అన్నారు. ఉత్తరావల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో బాల్యవివాహాలతో కలిగే అనర్థాలపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆడ పిల్లలకు 18, మగవారికి 21 సంవత్సరాలు నిండాకే వివాహం చేసుకోవాలన్నారు. చిన్నవయసులో వివాహాలు చేసుకోవడం వల్ల పిల్లల్లో శారీరక ఎదుగుదల ఉండదన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు, సచివాలయ మహిళా కానిస్టేబుల్ పి.శివదుర్గ, ఏఎన్‌ఎం జి.జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.